# వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా..

సంపుటి : 3 సంచిక : 318 సోమవారం 6 ఏప్రిల్ 2026 పేజీలు : 8 వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri



News Portal Designing
Epaper Designing &
Web Hosting

Vn Media

+91 8099779988

vntelugudaily@gmail.com




# కేరళ ఎన్నికలపై యుద్ధం ప్రభావం



కేరళ ఎన్నికలపై వార్ ఎఫెక్ట్.. ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్, బీజేపీల్లో ఎవరికి బెనిఫిట్

ఈ ఎన్నికల్లో ఇది ఏ పార్టీకి లాభం చేకూరుస్తుంది?

గల్ఫ్ దేశాల నుంచి దాదాపు 50 వేల మంది!

2



## ఎన్నికల తర్వాత బంగాల్ నుంచి భయం పారిపోతుంది

- బంగాల్‌లో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు ఖాయం
- బీజేపీ మహావిజయంతో ప్రజల్లో భరోసా పెరుగుతుంది
- ఎన్నికల తర్వాత టీఎంసీ పాపాల లెక్కతేల్చి శిక్షిస్తాం: ప్రధాని మోదీ



## రళలో ఎన్‌డీఏ ప్రభుత్వ ఏర్పాటుకు సమయం ఆసన్నమైంది

- కేరళ యువతకు సరైన ఉద్యోగాలు లేవు
- ఫలితంగా గల్ఫ్ దేశాలకు వలస వెళ్తున్నారు
- ఇకపై అలాంటి అవసరం రాకుండా కేరళను అభివృద్ధి చేస్తాం
- కున్నతునాడు నియోజకవర్గంలో అమిత్ షా వ్యాఖ్యలు

## క్రీడల్లో తెలంగాణను దేశానికే ఆదర్శంగా

# నిలుపుతాం

- "ఒలింపిక్స్ పతకాల గెలుపులో మనం చాలా చిన్న దేశాలకంటే వెనుకబడి ఉన్నాం
- దేశంలో యువతకు సరైన క్రీడా సదుపాయాలు లేవు
- సదుపాయాల కల్పనపై అధ్యయనం కోసం దక్షిణ కొరియాలో పర్యటించాం
- తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలపాలని నిర్ణయించుకున్నాం



హైదరాబాద్

జాతీయ స్థాయిలో పోలీసులకు పోటీలు నిర్వహించడం సంతోషకరమని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన 'ఆల్ ఇండియా పోలీసు ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్' ముగింపు వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఉన్న 34 పోలీసు విభాగాలు ఇందులో పాల్గొన్నాయన్నారు. ఈ టోర్నీకి బీఎన్ మల్లిక్ పేరు పెట్టడం చాలా గొప్ప నిర్ణయమని చెప్పారు. పోలీసు స్పైగా బీఎన్ మల్లిక్ దేశానికి గొప్ప సేవలు అందించారని తెలిపారు. "ఒలింపిక్స్ పతకాల గెలుపులో మనం చాలా చిన్న దేశాలకంటే వెనుకబడి ఉన్నాం. దేశంలో యువతకు సరైన క్రీడా సదుపాయాలు లేవు. సదుపాయాల కల్పనపై అధ్యయనం కోసం దక్షిణ కొరియాలో పర్యటించాం. తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలపాలని నిర్ణయించుకున్నాం. అంతర్జాతీయ క్రీడా ప్రమాణాలతో స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నాం. వివిధ క్రీడల్లోని ప్రముఖులను ఇందులో భాగస్వాములను చేశాం. తెలంగాణ ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహిస్తోంది. బాక్సర్ నిఖత్ - మిగతా3లో



## లచ్చమ్మ కుంట చెరువు..

## హైడ్రాకు హరీష్ సవాల్

- 'దళితుల భూములను కాంగ్రెస్ భక్షించే ప్రయత్నం జరుగుతోంది
- నాదర్‌గూల్ భూముల కుంభకోణం జరిగింది
- పేదల భూముల్లోకి వారిని పోకుండా అడ్డుకుంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారు

హైదరాబాద్

భూముల విషయంలో పెద్దలే గద్దలుగా మారితే ఎలా అని ప్రశ్నించారు మాజీ మంత్రి హరీష్ రావు. నాదర్‌గూల్ భూముల ఆక్రమణ వెనుక మంత్రి పొంగులేటి సభ్యులే ఉన్నారని ఆరోపించారు. హైదరాబాద్ నడిబొడ్డున 7000 కోట్ల భూ కుంభకోణం జరుగుతోందని ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. మాజీ మంత్రి హరీష్ రావు తాజాగా మీడియాతో మాట్లాడుతూ.. 'దళితుల భూములను - మిగతా3లో

## 'ప్రతీకారం తీర్చుకోవడానికి ఓటు వేయండి'



- ప్రజలకు మమతా బెనర్జీ పిలుపు
- ఎస్ఐఆర్‌లో పేర్లు తొలగించడంపై మమతా ఆగ్రహం
- ఎస్ఐఅర్‌కు వ్యతిరేకంగా ఓటు వేయాలని ప్రజలకు పిలుపు

# ఈ ప్రాజెక్టు ఓ గొప్ప అవకాశం

- హైకోర్టు జోన్-2 భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన
- ప్రభుత్వానికి సీజేఐ అభినందనలు
- రాజేంద్రనగర్‌లో హైకోర్టు జోన్-2 భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన
- సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ చేతుల మీదుగా శంకుస్థాపన
- కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్, హైకోర్టు సీజే జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్



హైదరాబాద్

రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ వద్ద కొత్తగా నిర్మిస్తున్న హైకోర్టు రెండో జోన్ భవన నిర్మాణ పనులకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ శంకుస్థాపన చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. శంకుస్థాపన చేసే ప్రదేశానికి చేరుకున్న జస్టిస్? సూర్యకాంత్‌కు రేవంత్ రెడ్డి సహా న్యాయమూర్తులు, అధికారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు సీజేఐ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. - మిగతా3లో

## మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణ

# 2 ఏళ్లుగా లేఖలతోనే సరి



- నీటిపారుదల శాఖకు 21 లెటర్స్
- బాధ్యత నిర్మాణ సంస్థదేనని సీఎం స్పష్టం చేసినా చర్యలు తీసుకోని ప్రాజెక్టు ఇంజినీర్లు
- నెల క్రితం ఈఎన్సీ కాళేశ్వరం సీఈకి లేఖ రాసినా కనిపించని స్పందన
- సర్టిఫికెట్‌ను రద్దు చేసిన ప్రభుత్వం

హైదరాబాద్

మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణ బాధ్యత నిర్మాణ సంస్థదేనని ముఖ్యమంత్రి స్పష్టం చేసిన కూడా ప్రాజెక్టు ఇంజినీర్లు మాత్రం ఎటువంటి చర్యలు చేపట్టలేకపోయారు. కాళేశ్వరం ఈఎన్సీ నెల క్రితమే చీఫ్ ఇంజినీర్‌కు లెటర్? రాసిన ఇప్పటకీ దానిపై ఎటువంటి స్పందనా కనిపించలేదు. మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణ బాధ్యత నిర్మాణ సంస్థదేనని ప్రభుత్వం స్పష్టత చేస్తున్నా ప్రాజెక్టు ఇంజినీర్లు మాత్రం ఈ దిశగా చర్యలు తీసుకోకపోవడం చర్చనీయాంశంగా మారింది. నిర్మాణ సంస్థకు తుది నోటీసు జారీ చేయాలని తీసుకొన్న చర్యలను తమకు నివేదించాలని నీటిపారుదల శాఖ లేఖ రాసినా ప్రాజెక్టు ఇంజినీర్లు - మిగతా3లో

## కాంగ్రెస్‌కు 'బబ్బర్ షేర్' ప్రచారం

- మా ప్రత్యర్థులకు నిద్రపట్టడం లేదు: రాహుల్ గాంధీ
- అసోంను ఏకం చేయటానికి సంగీతకారుడు జుబీన్ గార్గ్ తన జీవితమంతా కృషి చేశారని కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ వ్యాఖ్య



# కేరళ ఎన్నికలపై యుద్ధ ప్రభావం




ఏప్రిల్ 9న ఒకే విడతలో జరగనున్న కేరళ అసెంబ్లీ ఎన్నికలపై పశ్చిమాసియా యుద్ధం తీవ్ర ప్రభావం చూపుతోంది. కేరళ ఆర్థిక వ్యవస్థకు 'గల్ఫ్ దేశాలే' ప్రాణాధారం. కానీ ఇప్పుడు అక్కడ నెలకొన్న యుద్ధ వాతావరణం కేవలం ఆర్థిక వ్యవస్థనే కాదు, కేరళ ఎన్నికల ఫలితాలను సైతం శాసించేలా కనిపిస్తోంది. ఓట్లు వేసేందుకు స్వదేశానికి వచ్చే ప్రవాస భారతీయుల సంఖ్య భారీగా పడిపోతుండటంతో నువ్వా నేనా అన్నట్లు అనేక నియోజకవర్గాల్లో పోటీ నెలకొంది. కాగా, ఈ ఎన్నికల్లో ఎలాగైనా సరే అధికారం నిలబెట్టుకోవడానికి ఎల్‌డీఎఫ్ విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. అలాగే కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ సైతం గెలుపే లక్ష్యంగా ముందుకెళ్తోంది. మరోవైపు, బీజేపీ కూడా ఈ సారి ఎన్నికల్లో విజయం సాధించాలని శాయశక్తులా పోరాడుతోంది.? మరి ఈ పరిస్థితుల్లో గల్ఫ్ యుద్ధం కేరళ ఎన్నికల ముఖచిత్రాన్ని ఎలా మార్చేస్తుందో ఈ కథనంలో చూద్దాం.

**గల్ఫ్ దేశాల నుంచి దాదాపు 50 వేల మంది!**

సాధారణంగా కేరళ ఎన్నికలు వస్తున్నాయంటే చాలు గల్ఫ్ దేశాల నుంచి దాదాపు 50 వేల మందికి పైగా ప్రవాస భారతీయులు ప్రత్యేక విమానాల్లో వచ్చి మరీ తమ ఓటు హక్కును వినియోగించుకుంటారు. కానీ ఈ ఎన్నికల్లో ఆ సంఖ్య అనూహ్యంగా 5,000 కంటే దిగువకు పడిపోతుందని అంచనా. యుద్ధం కారణంగా ఆకాశాన్నంటిన విమాన ఛార్జీలు, గగనతల ఆంక్షలతో విమాన సర్వీసుల రద్దు, గల్ఫ్ దేశాల్లో తలెత్తిన సెలవుల సంక్షోభం దీనికి ప్రధాన కారణాలు. యుద్ధ భయంతో దుబాయ్, దోహా తదితర ప్రాంతాల్లోని కంపెనీలు తమ ఉద్యోగుల సెలవులను కేవలం 10-12 రోజులకు కుదించాయి. దీంతో ఒక్క ఓటు కోసం వేలకు వేలు ఖర్చుపెట్టుకుని కేరళ రావడం ప్రవాసులకు ఆర్థికంగా పెను భారంగా మారింది. ఏకంగా 2.4 లక్షల మంది ఓవర్సీస్ ఓటర్లు నమోదు చేసుకున్నప్పటికీ ఈసారి పోలింగ్ బూత్‌లకు వచ్చేవారి సంఖ్య రికార్డు స్థాయిలో పడిపోనుంది. కేరళ రాజకీయాల్లో కేవలం వందల ఓట్ల తేడాతోనే అభ్యర్థుల తలరాతలు మారుతుంటాయి. ప్రవాస ఓటర్ల రాక తగ్గడం స్వింగ్ సీట్లలో భారీ ప్రభావం చూపనుంది. ముఖ్యంగా వడకర, నాదాపురం, పొన్నాని, చావక్కాడ్ లాంటి నియోజకవర్గాల్లో ప్రవాస ఓటర్ల ప్రభావం అత్యధికం. గతంలో ముస్లిం లీగ్ , యూడీఎఫ్? అనుబంధ సంస్థలు ఫ్లైట్స్ బుక్ చేసి మరీ ఓటర్లను రప్పించేవి. కానీ ఇప్పుడు ఈ ఓటర్లు గల్ఫ్‌కే పరిమితం కావడం యూడీఎఫ్?నకు గట్టి ఎదురుదెబ్బగా మారే అవకాశముంది. ఇదే అదనుగా ఆయా స్థానాల్లో పట్టు సాధించాలని ఎల్‌డీఎఫ్, ఎన్‌డీఏ కూటములు వ్యూహాలు రచిస్తున్నాయి.

ఓటింగ్‌తో పాటు, గల్ఫ్ ఆర్థిక సంక్షోభం ఇప్పుడు ఎన్నికల ప్రచారంలో ప్రధాన అస్త్రంగా మారింది. గల్ఫ్‌లో పనిచేస్తున్న కేరళ వాసులు ఏటా 2.16 లక్షల కోట్ల రూపాయలను తమ స్వరాష్ట్రానికి పంపిస్తుంటారు. కానీ యుద్ధం కారణంగా ఈ ఏడాది అందులో 20 శాతం కోత పడనుందని అంచనా. కొంత మంది ఉద్యోగాలు కూడా కోల్పోయే ప్రమాదం ఉంది.

**గల్ఫ్ దేశాల నుంచి వచ్చే ప్రవాసులకు తాము అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే**

రక్షణ కవచం అని అధికార ఎల్?డీఎఫ్? ప్రచారం చేస్తోంది. స్థానికంగా ఉద్యోగాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని, గల్ఫ్ పై అతిగా ఆధారపడటం వల్లే ఈ దుస్థితి వచ్చిందని విపక్ష యూడీఎఫ్? విమర్శిస్తోంది. గల్ఫ్?లో ఉన్న భారతీయులను రక్షించే సత్తా కేంద్ర ప్రభుత్వానికే ఉందని ఎన్‌డీఏ ప్రచారం చేస్తూ ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేస్తోంది. ప్రవాసులు రాలేని పరిస్థితి నెలకొన్న నేపథ్యంలో కేరళ రాజకీయాల్లో సరికొత్త ట్రెండ్ మొదలైంది. అదే "వాట్సాప్ ఓటు". గల్ఫ్‌లో ఉండే ఒక్కో వ్యక్తి తన కుటుంబంలో కనీసం 4 నుంచి 8 ఓట్లను ప్రభావితం చేయగలడని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. దీంతో పార్టీలు ఇప్పుడు విమాన టికెట్లకు బదులు డిజిటల్ ప్రచారంపై దృష్టి పెట్టాయి. దుబాయ్ నుంచి చేసే ఒక్క వీడియో కాల్, స్థానికంగా జరిగే పది సభల కంటే ఎక్కువ ప్రభావం చూపుతుందని పార్టీలు నమ్ముతున్నాయి. ఓటర్లు భౌతికంగా గల్ఫ్ లోనే ఆగిపోయినా వారి నిర్ణయాలు మాత్రం స్మార్ట్‌ఫోన్ల ద్వారా కేరళ రాజకీయాలను శాసిస్తున్నాయి. "మిడిల్ ఈస్ట్" ఎఫెక్ట్‌ను దాటుకుని ఏప్రిల్ 9న ఏ పార్టీ విజయం సాధిస్తుందో వేచి చూడాలి.

# రళలో ఎన్‌డీఏ ప్రభుత్వ ఏర్పాటుకు సమయం ఆసన్నమైంది

కేరళలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రచారం ఊపందుకుంది. ఈ అసెంబ్లీ ఎన్నికలు కేవలం ప్రభుత్వాన్ని మార్చడానికి మాత్రమే కాదని, రాష్ట్ర భవిష్యత్తును మెరుగుపరచడానికేనని కేంద్ర హోంమంత్రి అమిత్? షా వ్యాఖ్యానించారు. 2014 లోక్?సభ ఎన్నికల తర్వాత కేరళలో ఎన్?డీఏ ఓట్లు పెరిగాయని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఇది అనువైన సమయమని పేర్కొన్నారు. అయితే, కేరళలో ప్రభుత్వ ఏర్పాటుకు ప్రజలు తమకు మద్దతు అవసరమని షా నొక్కి చెప్పారు. ఎర్నాకుళం జిల్లా కున్నతునాడు నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో పాల్గొన్న షా, ఈ మేరకు వ్యాఖ్యానించారు. "ఈ ఎన్నికలు కేవలం ఎల్‌డీఎఫ్ ప్రభుత్వాన్ని తొలగించి ఎన్?డీఏ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావడం కోసమే కాదు. ఇవి కేరళ భవిష్యత్తు కోసం జరుగుతున్న ఎన్నికలు. భారతదేశంలో సంపూర్ణ అక్షరాస్యత సాధించిన మొట్టమొదటి రాష్ట్రం కేరళే. ఇక్కడి యువత ఎంతో ప్రతిభావంతులు, తెలివైనవారు, కానీ వారికి సరైన ఉద్యోగాలు లేవు. ఫలితంగా వారు ఉద్యోగాల కోసం ఇతర గల్ఫ్ దేశాలకు వెళ్తున్నారు. అయితే, ఇకపై అలాంటి అవసరం లేకుండా ఇక్కడే వారికి ఉద్యోగాలు లభించేలా ఒక గొప్ప కేరళను నిర్మించాలని మేము ఆశిస్తున్నాం. ప్రపంచం నలుమూలలా కమ్యూనిస్టు పార్టీ కనుమరుగైపోతోంది. అలాగే దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ కూడా అంతరించిపోతోంది. నేడు, ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలో యావత్తు దేశం ముందుకు సాగుతోంది.



2014 లోక్‌సభ ఎన్నికల్లో, కేరళ నుంచి వచ్చిన ఓట్లలో 14 శాతం ఎన్?డీఏ కూటమికి దక్కాయి. కాబట్టి ఎన్?డీఏ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సిన సమయం ఆసన్నమైంది."

**ఆ మార్క్సిస్ట్ నాయకుడు పేర్లు మార్చే స్టార్టప్‌ను ప్రారంభించారు!**

మరోవైపు ముఖ్యమంత్రి పినరయి విజయన్‌పై అమిత్ షా తీవ్ర విమర్శలు గుప్పించారు. ఆ మార్క్సిస్ట్ నాయకుడు పేర్లు మార్చే స్టార్టప్‌ను ప్రారంభించారని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో కేంద్ర నిధులతో చేపట్టిన అన్ని ప్రాజెక్టుల పేర్లు మార్చి, వాటి ఘనతను తన ఖాతాలో వేసుకుంటున్నారని ఆరోపించారు. "ప్రధాని మోదీ ప్రతి పేద వ్యక్తికీ 5 కిలోల బియ్యాన్ని అందిస్తున్నారు. అలాగే, జాతీయ రహదారి 66 నిర్మాణానికి అయ్యే ఖర్చులో 100 శాతాన్ని మోదీనే భరిస్తున్నారు. కానీ ముఖ్యమంత్రి విజయన్ భారీ పోస్టర్లు దర్శనమిస్తున్నాయి. అదేవిధంగా, జాతీయ ఆరోగ్య మిషన్ కోసం ప్రధానమంత్రి మోదీ రూ. 600 కోట్లు పంపిస్తున్నారు, కానీ అక్కడ ఫొటోలు పెట్టుకోవడానికి స్థలం లేదన్న సాకుతో దాన్ని మూసివేశారు. నిన్న రాహుల్ గాంధీ వచ్చి పెట్రోల్ ధరలు పెరిగాయని అన్నారు. కానీ అది కేరళలో కాదు, పాకిస్తాన్‌లో" అని షా వ్యాఖ్యానించారు.

**'భారత్ మాతను అత్యున్నత పీఠంపై నిలపడానికే మేం రాజకీయాల్లో ఉన్నాం'**

మరోవైపు, తిరువనంతపురం బహిరంగ సభలోనూ అమిత్ షా మాట్లాడారు. ఈ సారి కేరళలో తమ ప్రభుత్వాన్నే ఏర్పాటు చేయబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. కేరళలో ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్ ఎవరు కూడా ప్రజలకు మంచి చేయలేదని, వారంతా అవినీతికి పాల్పడ్డారని షా ఆరోపించారు. కానీ, తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే, శబరిమల ఆలయ బంగారు కేసులో నిందితులను జైలులో పెడతామని హామీ ఇచ్చారు. భారత్ మాతను అత్యున్నత పీఠంపై నిలపడానికే తాము రాజకీయాల్లో ఉన్నామని షా పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, 140 అసెంబ్లీ స్థానాలకు గానూ కేరళలో ఏప్రిల్ 9న పోలింగ్ జరగనుంది. అలాగే మే 4న ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరగనుంది. ప్రస్తుత అసెంబ్లీ పదవీకాలం మే 23తో ముగియనుంది. కాగా, కేరళలో అధికారంలో ఉన్న సీపీఐ(ఎం) నేతృత్వంలోని ఎల్‌డీఎఫ్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని, కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) చూస్తోంది. మరోవైపు, రాష్ట్రంలో దాదాపు దశాబ్ద కాలంగా ఎల్‌డీఎఫ్ అధికారంలో ఉంది.

# 'ప్రతీకారం తీర్చుకోవడానికి ఓటు వేయండి'

అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్‌ఐఆర్)పై బంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. ఎస్‌ఐఆర్ ప్రక్రియలో అనేక మంది పేర్లు తొలగించారని ఆరోపించారు. అయితే, ప్రజల పేర్లను తొలగించినందుకు ప్రతీకారం తీర్చుకోవడానికి, అలాగే ఎస్‌ఐఆర్‌కు వ్యతిరేకంగా ఓటు వేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఎన్నికల ఫలితాల్లోనే మీ ప్రతిస్పందన కనిపించాలన్నారు. అలాగే ఎస్‌ఐఆర్‌లో పేర్లు గల్లంతైన వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు పార్టీ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని మమతా సూచించారు. ముర్షిద్షబాద్‌లోని సంషేర్‌గంజ్ జరిగిన ఎన్నికల సభలో మమతా బెనర్జీ ఈ మేరకు వ్యాఖ్యానించారు. ఓటర్ల జాబితా తొలగింపునకు కేంద్ర ప్రభుత్వాన్ని పరోక్షంగా బాధ్యులుగా చూపిస్తూ మమత విమర్శించారు. ధైర్యం ఉంటే నేరుగా పోటీ చేయాలని వ్యాఖ్యానించారు. అలాగే, కొందరు బూత్ ఏజెంట్లు ప్రలోభాలకు లోనుకాకుండా పార్టీ ప్రయోజనాలను కాపాడాలని కోరారు. కొన్నిచోట్ల ఈవీఎం యంత్రాల పనితీరుపై కూడా ఆమె అనుమానాలు వ్యక్తం చేశారు. కొన్ని ప్రాంతాల్లో యంత్రాలు పనిచేయకుండా చేసే ప్రయత్నాలు జరుగుతాయని ఆరోపించారు. అలాంటి సందర్భాల్లో మరమ్మతులు చేయకుండా కొత్త యంత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేయాలని కార్యకర్తలను ఆదేశించారు.

**'వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా నిలిచా'**

ముస్లింల ప్రయోజనాల కోసం తాను పోరాడుతున్నానని, వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా నిలిచినట్లు మమతా బెనర్జీ స్పష్టం చేశారు. కానీ ఈ విషయంలో బీజేపీ తనపై తప్పుడు ప్రచారాలు చేస్తోందని ఆరోపించారు. అయితే, వక్ఫ్ చట్ట అమలుతో ముర్షిదాబాద్ జిల్లాలో జరిగిన హింసాత్మక ఘటనలను ప్రస్తావించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ప్రాణనష్టాలు జరిగినట్లు గుర్తుచేశారు. అయితే, ఆ హింసాత్మక ఆందోళనలకు టీఎంసీ ప్రేరేపిస్తోందని బీజేపీ ఆరోపించింది. ఈ ఆరోపణలను సైతం మమతా ఖండించారు.



**టీఎంసీ పాలనలో ఉద్యోగ అవకాశాలు పెరిగాయి!**

ఇదిలా ఉండగా, టీఎంసీ పాలనలో మైనారిటీలు, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన యువతకు విద్యా అవకాశాలు పెరిగాయని మమతా పేర్కొన్నారు. వారు ఉన్నత ఉద్యోగాలు సాధిస్తున్నారని చెప్పారు. అయితే, సమాజం పురోగమిస్తోందని, కానీ ప్రత్యర్థి పార్టీలు దాన్ని సహించలేకపోతున్నాయని మమతా తెలిపారు. టీఎంసీ వరుసగా నాలుగోసారి పదవిలోకి వస్తే, మహిళల కోసం అమలు చేస్తున్న లక్ష్మీర్ భండార్ పథకాన్ని కొనసాగిస్తామని, జీవితకాల ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే, నిరుద్యోగ యువత కోసం ప్రారంభించిన బంగ్లార్ యువ సాథి పథకం కింద నెలకు రూ.1500 చొప్పున సహాయం అందిస్తామని తెలిపారు.

**అలాగైతే ముందు వాళ్లే రాజీనామా చేయాలి!**

అసెంబ్లీ ఎన్నికల కారణంగా అభివృద్ధి పనులు నిలిచిపోయా యని మమత పేర్కొన్నారు. ఎన్నికల సంఘం దాదాపు 500 మంది అధికారులను బదిలీ చేసిందని, ఎన్నికల తర్వాత పనులు మళ్లీ ప్రారంభమవుతాయని చెప్పారు. అలాగే, ఎన్నికల సంఘం చర్యలపై కూడా ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్‌ఐఆర్ పేరుతో కొంత మంది ఓటర్లను బెదిరిస్తున్నారని, మరికొందరిని తొలగిస్తున్నారని ఆరోపిం చారు. ఓటర్ల జాబితాలో చొరబాటుదారుల పేర్లు ఉంటే, గతంలో ప్రధానమంత్రి, హోంమంత్రి కూడా వారి ఓట్లతోనే గెలిచారని మమతా అన్నారు. కాబట్టి వారే ముందుగా రాజీనామా చేయాలని వ్యాఖ్యానించారు. అదేవిధంగా, 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఉపయోగించిన జాబితానే ఈసారి ఎందుకు ఉపయోగించలేదని మమతా ప్రశ్నించారు.

**బంగాల్ అసెంబ్లీ ఎన్నికల సమరం**

కాగా, బంగాల్‌లో 294 అసెంబ్లీ స్థానాలకు గానూ ఏప్రిల్ 23, 29 రెండు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. అలాగే మే 4న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో అన్ని పార్టీలు ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నాయి. గెలుపే లక్ష్యంగా అధికార, విపక్ష పార్టీలు పావులు కదుపుతు ముందుకు సాగుతున్నాయి.

## ఎన్నికల తర్వాత బంగాల్ నుంచి భయం పారిపోతుంది



బంగాల్‌లో ఈసారి బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు అవుతుందని ప్రధాని నరేంద్ర మోదీ ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల తర్వాత బంగాల్ నుంచి భయం పారిపోతుందన్నారు. కూచ్ బెహార్‌లో జరిగిన ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్న ప్రధాని మోదీ, టీఎంసీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గతంలో ఇతర ప్రాంతాల వారికి ఉపాధి కల్పించిన బంగాల్‌ను టీఎంసీ సర్కార్ వలసలకు కేంద్రంగా మార్చిందని దుయ్యబట్టారు. బంగాల్‌లో శాంతిభద్రతలకు అంతిమ యాత్ర నిర్వహించేందుకు టీఎంసీ కంకణం కట్టుకుందని ప్రధాని విమర్శించారు. ఈ ఎన్నికలు అధికార పక్షం వ్యాపింపజేస్తున్న భయం, బీజేపీ కల్పిస్తున్న భరోసా మధ్య పోరుగా ప్రధాని మోదీ అభివర్ణించారు. టీఎంసీ బుజ్జగింపు రాజకీయాల కారణంగా గ్రేట్ బంగాల్ తన గుర్తింపు కోల్పోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. చొరబాటుదారులను రక్షించేందుకు ా.×.=., జ.ూా.ూా.ను టీఎంసీ అడ్డుకుంటోందని ఆరోపించారు. బంగాల్ సరిహద్దు ప్రాంతాల్లో జనాభా మార్పు ప్రమాదకరంగా ఉన్నట్లు ప్రధాని మోదీ తెలిపారు. ఎన్నికల తర్వాత టీఎంసీ పాపాల లెక్క తేల్చటమే కాకుండా బాధ్యులైన వారికి శిక్ష తప్పదని హెచ్చరించారు. ఎన్నికల సంఘంపై తనకు పూర్తి నమ్మకం ఉందని, ఎన్నికలు భయం లేకుండా స్వేచ్ఛగా, న్యాయంగా జరుగుతాయని ప్రధాని మోదీ తెలిపారు.

"పోలింగ్ రోజు టీఎంసీ గూండాలు మిమ్మల్ని(ప్రజలను) ఎంత బెదిరించినా కూడా చట్టంపై నమ్మకం ఉంచాలి. ఈ ఎన్నికల్లో బంగాల్ నుంచి భయం పారిపోతుంది. బీజేపీ మహావిజయంతో భరోసా పెరుగుతుంది. నేను మీకు హామీ ఇస్తున్నాను. ఈసారి ఎన్నికల తర్వాత వారి (టీఎంసీ)పాపాల లెక్క పూర్తిగా తేలుస్తాం. వెతికి వెతికి మరీ లెక్కిస్తాం. మే 4వ తేదీ తర్వాత చట్టం తనపని తాను చేస్తుంది. ఎంత పెద్ద గూండా అయినా సరే ఈసారి శిక్ష తప్పదు. ఒకవైపు తృణమూల్ కాంగ్రెస్ పట్ల భయం ఉంటే, మరోవైపు బీజేపీ పట్ల మీకు నమ్మకం ఉంది. ఒకవైపు తృణమూల్ కాంగ్రెస్ వారి కమీషన్ల దందా, అవినీతి పట్ల భయం ఉంటే, మరోవైపు అభివృద్ధిని వేగవంతం చేయగల బీజేపీ పట్ల నమ్మకం ఉంది. ఒకవైపు చొరబాటుదారుల బెడద పట్ల భయం ఉంటే, మరోవైపు రాష్ట్రం నుంచి చొరబాటుదారులను తరిమికొట్టగల బీజేపీ పట్ల నమ్మకం ఉంది." ఈ క్రమంలోనే 2029 లోక్‌సభ ఎన్నికల నుంచి 'మహిళా రిజర్వేషన్ల చట్టం'ను అమలు చేసేందుకు అవసరమైన బిల్లులను ఆమోదం కోసం ప్రభుత్వం పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తుందని గుర్తు చేశారు. "ఇప్పటివరకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మన సోదరీమణులకు అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పించింది. మేము 3 కోట్ల మంది సోదరీమణులను 'లఖ్‌పతి దీదీ' లుగా మార్చాము. ఈ క్రమంలోనే దేశం కోసం తీసుకునే నిర్ణయాల్లో మహిళల పాత్ర మరింత పెరగడం అత్యంత అవసరం. అందుకే లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33% రిజర్వేషన్ కల్పించేలా మా ప్రభుత్వం ఒక చట్టాన్ని రూపొందించింది. 2029 లోక్‌సభ ఎన్నికల నుంచే బంగాల్‌తో సహా దేశవ్యాప్తంగా ఉన్న సోదరీమణులందరూ ఈ రిజర్వేషన్ ప్రయోజనాలను పొందేలా చేయడానికి ప్రస్తుతం కృషి చేస్తున్నాం. అందుకే ఏప్రిల్ 16- 18 తేదీల్లో పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశాం. మన తల్లులు, సోదరీమణులకు దక్కాల్సిన ఈ హక్కు గత 40 ఏళ్లుగా పెండింగ్‌లో ఉంది. దీనిపై ఇకపై ఎటువంటి జాప్యం చేయడం సముచితం కాదు. కూచ్ బెహార్ వేదికగా దేశంలోని అన్ని రాష్ట్రాలకు నేను మరోసారి భరోసా ఇస్తున్నాను. జనాభా నియంత్రణలో ఉత్తమ పనితీరు కనబరిచిన రాష్ట్రాలు, సీట్ల కేటాయింపు విషయంలో ఎటువంటి నష్టాన్ని ఎదుర్కోవు. అందరూ లబ్ధి పొందుతారు. అన్ని రాష్ట్రాల భాగస్వామ్యం, ప్రతి ఒక్కరి హక్కులు సురక్షితంగా ఉంటాయి. మహిళల కోసం అదనపు సీట్లను పెంచడం ద్వారా రాష్ట్రాలు భారీ ప్రయోజనాలను పొందేలా చూడాలనే విషయాన్ని పార్లమెంటులో బలంగా ముద్ర వేయాలని మేము కోరుకుంటున్నాం." అని ప్రధాని మోదీ అన్నారు.

## కాంగ్రెస్‌కు 'బబ్బర్ షేర్' ప్రచారం



లఅసోంను ఏకం చేయటానికి సంగీతకారుడు జుబీన్ గార్గ్ తన జీవితమంతా కృషి చేశారని కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ అన్నారు. ఆయన ఎప్పుడు కూడా ఎవరితో దురుసుగా ప్రవర్తించలేదన్నారు. కాంగ్రెస్ సిద్ధాంతం కూడా ద్వేషానికి వ్యతిరేకంగా ప్రేమను పంచటమే అని అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థుల తరఫున బిశ్వనాథ్ జిల్లాలో ప్రచారం చేసిన రాహుల్, బీజేపీ, అసోం సీఎం హిమంత బిశ్వశర్మపై విమర్శలు చేశారు. దేశంలో అత్యంత అవినీతిపరుడైన సీఎం హిమంత బిశ్వశర్మపై తమ పార్టీ అధికారం చేపట్టిన తర్వాత చర్యలు తీసుకుంటుందని రాహుల్ హామీ ఇచ్చారు. అసోం సీఎం హిమంత బిశ్వశర్మ క్షమాపణలు కోరినా, ఆయన్ను వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు. "అసోంకు చెందిన దివంగత గాయకుడు జుబిన్ గర్గ్ రాష్ట్ర ప్రజలను ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు తన జీవితాంతం కృషి చేశారు. ఆయన ఎవరితోనూ దురుసుగా ప్రవర్తించలేదు. మా పార్టీ భావజాలం కూడా అలాంటిదే. ద్వేషానికి వ్యతిరేకంగా ప్రేమను పంచడమే మా కాంగ్రెస్? సిద్ధాంతం. మేం అధికారంలోకి వస్తే వందరోజుల్లో జుబీన్ గార్గ్ కేసులో విచారణ జరిపి బాధ్యులకు శిక్షపడేలా చూస్తాం. 6 గిరిజన జాతులకు ఎస్టీ హోదా కల్పిస్తాం. తేయాకు కార్మికులకు రోజుకు రూ.450 వేతనం ఇస్తాం. మా ప్రభుత్వం అధికారంలోకి రాగానే చేసే మొదటిపని నెలవారీ నగదు బదిలీ కింద ప్రతి మహిళ ఖాతాలో డబ్బు జమ చేస్తాం. చిరు వ్యాపారం చేయాలనుకునే మహిళల ఖాతాలో 50వేలు జమచేస్తాం. కాంగ్రెస్ బబ్బర్ షేర్ ప్రచారం చేస్తున్నాడని మా ప్రత్యర్థులకు నిద్రపట్టడం లేదు"

**హిమంత క్షమాపణలు కోరినా, ఆయనపై చర్యలు తప్పవని స్పష్టం**

హిమంత నేతృత్వంలోని బీజేపీ సర్కారు ప్రజల్లో విద్వేషాన్ని వ్యాప్తి చేస్తోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. హిమంత అవినీతి చిట్టా ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్ షా వద్ద ఉందని అన్నారు. ఇక్కడి ప్రభుత్వాన్ని దిల్లీ నుంచి నియంత్రిస్తున్నారని, రాష్ట్రాన్ని బీజేపీ ఏటీఎంలా మార్చేశారని విమర్శించారు. మరికొన్ని రోజుల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటవుతుందని, అప్పుడు హిమంత క్షమాపణలు కోరినా, ఆయనపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. "మీ ముఖ్యమంత్రి 24 గంటలూ అర్థం లేని మాటలు మాట్లాడుతూనే ఉంటారు. కాంగ్రెస్? నాయకులు అసోంను విభజించడానికి ఎప్పుడూ చూడలేదు. వారు ఎప్పుడూ ద్వేషాన్ని వ్యాప్తి చేయడానికి ప్రయత్నించలేదు. అయితే, మీ ముఖ్యమంత్రి మాత్రం నిరంతరం రాష్ట్రాన్ని విభజించి, ద్వేషాన్ని వ్యాప్తి చేయడానికి ప్రయత్నిస్తున్నారు. హిమంత బిశ్వ శర్మ అసంబద్ధమైన వ్యాఖ్యలు చేస్తున్నారు. ఆయన భారతదేశంలోనే అత్యంత అవినీతిపరుడైన ముఖ్యమంత్రి కాబట్టే ఇలా చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీలోని 'సింహాలు' తనను జైలులో పెడతారని ఆయనకు తెలుసు."

అసోం ప్రజల ప్రయోజనాల కంటే, కొన్ని కార్పొరేట్ గ్రూపుల లాభం కోసం బీజేపీ ప్రభుత్వం పనిచేస్తోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ క్రమంలోనే ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షాతో సహా కేంద్ర నాయకత్వాన్ని కూడా లక్ష్యంగా చేసుకున్నారు. అసోం వనరులను పారిశ్రామికవేత్తలకు అప్పగిస్తున్నారని ఆయన ఆరోపించారు. "దిల్లీలో కూర్చున్న ఆయన వ్యాపార భాగస్వాములు నరేంద్ర మోదీ, అమిత్ షా మిమ్మల్ని వారి వ్యక్తిగత ఏటీఎంలా మార్చేశారు. మీ భూమిని అంబానీ, అదానీ, బాబా రామ్‌దేవ్‌లకు అప్పగించారు. ఆయన ఈ భూమిని ఉచితంగా ఇవ్వరు. బదులుగా ఈ వ్యక్తులు ఆయనకు తమ మద్దతును అందిస్తున్నారు. ట్రంప్ ట్వీట్ పంపినప్పుడల్లా మోదీ వణికిపోతుంటారు." అని రాహుల్ గాంధీ అన్నారు.

# వార్ ఎఫెక్ట్ - హీలియం కొరతతో

# ఎంఆర్ఐ స్కానింగ్ ఇక కష్టమే!



మనం బైక్ పై నుంచి కిందపడిపోయినప్పుడో, ప్రమాదాలు జరిగినప్పుడో, శరీరంలో ఏమైనా దెబ్బలు తగిలాయో తెలుసుకునేందుకు స్కానింగ్ లాంటివీ తీయాల్సి వస్తుంది. మరి ఆ స్కానింగ్‌కి చేయాలంటే ఎంఆర్?ఐ యంత్రం వినియోగించాల్సిందే. దీని ద్వారా రోగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కచ్చితమైన ఫలితాలు వెల్లడవుతాయి. మరి ఆ యంత్రాలు పని చేయాలంటే అందులో హీలియం నింపాలి. కాని గత నెల నుంచి ఇరాన్ యుద్ధ కారణంగా గ్యాస్ సరఫరాలు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో ఖతార్ నుంచి భారత్‌కు హీలియం దిగుమతులు కూడా ఆగిపోయాయి. దీంతో పలు ప్రాంతాల్లో ఎంఆర్ఐ స్కానింగ్ పరీక్షలు చేయడం లేదు.

**ఎంఆర్ఐ స్కానింగ్ ద్వారా రోగ నిర్ధారణ పరీక్షలు**

సూపర్ కండక్టింగ్ ఎంఆర్ఐ యంత్రాల్లో కీలకమైన హీలియంను ఈ దేశం నుంచే ఎక్కువగా దిగుమతి చేసుకుంటున్నాం. అమెరికా, ఇజ్రాయెల్? - ఇరాన్? యుద్ధంతో దిగుమతులు లేకపోవడంతో ఎంఆర్?ఐ యంత్రాలు ముఖ్యమైన మెడికల్? టెస్టులు ఎలా చేస్తాయనే సందేహం వ్యక్తమవుతోంది. దీనిలో మెదడుతో పాటు శరీరంలోని కీలక అవయవాల్లో ఏదైనా సమస్య తలెత్తితే మ్యాగ్నెటిక్? రిజోనెన్స్? ఇమేజింగ్ స్కానింగ్ ద్వారా వైద్యులు రోగ నిర్ధారణ చేస్తారు. వివిధ రకాల క్యాన్సర్లు, నరాల సమస్యలను గుర్తించేందుకు ఎంఆర్ఐ పరీక్ష ఎంతో అవసరం.

**అర్జెంటీనా నుంచి దిగుమతి**

ఈ యంత్రంలో పరీక్షలు చేసినప్పుడు కచ్చితమైన ఫలితాలు రావాలంటే అందులో అయస్కాంతాలు మైనస్? 269 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద చల్లబడాలి. ఇది కేవలం లిక్విడ్? హీలియంతోనే సాధ్యమవుతుంది. హీలియం కొరత ఏర్పడితే ఆరోగ్య రంగంపై తీవ్రంగా ప్రభావం పడుతుందని దిల్లీకి చెందిన ఇండియన్? రేడియోలాజికల్? అండ్? ఇమేజింగ్? అసోసియేషన్? కేంద్రానికి లేఖ రాసింది. ఈ సమస్యకు ప్రత్యామ్నాయంగా అర్జెంటీనా నుంచి దిగుమతి చేసుకోవాలని కేంద్రం ఆలోచిస్తున్నా కూడా అది ఇప్పటికిప్పుడు అంత సులువు కాదు .

**రెండు రకాల యంత్రాలు :**

సూపర్ కండక్టింగ్ ఎంఆర్ఐ యంత్రాల్లో లిక్విడ్? హీలియంతో కాయిల్స్ చల్లబడతాయి. 1.5 టెస్లా నుంచి 2 టెస్లాల సామర్థ్యంతో ఉండే ఇది ఫలితాలను ఇస్తుంది.


హీలియం వినియోగించకుండా పనిచేసేవి పర్మనెంట్? మ్యాగ్నెట్ ఎంఆర్ఐ. దీనిలో 0.3 టెస్లా సామర్థ్యంతో ఉండే వీటిని ఎముకలు తదితర భాగాలను పరీక్షించేందుకు ప్రాథమిక పరీక్షల కోసం వినియోగిస్తారు.

**మొత్తం 100 ఎంఆర్ఐ యంత్రాలు ఉన్నట్టు అంచనా**

రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో కలిపి సుమారు 100 వరకు ఎంఆర్?ఐ యంత్రాలున్నాయని అంచనా. మరి ఇవన్నీ సమర్థంగా ఫలితాలను వెల్లడించాలంటే అందులో తగిన మోతాదులో హీలియం ఉండాలి. ఈ యంత్రాల్లో ఒకసారి నింపితే సుమారుగా 2 సంవత్సరాల వరకు అది పని చేస్తుంది. రాష్ట్రంలోని ఇప్పటికే 10 శాతం యంత్రాల్లో హీలియం నిల్వలు తగ్గాయని వైద్య వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అంతేకాదు కొన్ని కేంద్రాలు మూత పడ్డా ఆశ్చర్యం పడాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆసుపత్రిలో ఒక్కో పరీక్ష ఖరీదు ఆసుపత్రులకు తగ్గట్టుగా రూ. ఆరు వేల నుంచి రూ. 9 వేల వరకు ఉంది. ఈ కొరత కారణంగా ధరలను మరింత పెంచితే అంతిమంగా భారం రోగులపై పడనుంది. మరోవైపు రాష్ట్రంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో మాత్రం హీలియం సమస్య రాదని, ఇటీవల ఏర్పాటు చేసిన 90 శాతం పైగా యంత్రాలు కొత్తవేనని, అన్ని చోట్ల ఎంఆర్?ఐ పరీక్షలు నడుస్తున్నాయని వైద్యులు స్పష్టం చేశారు.

# హైదరాబాద్‌లో మరోసారి డ్రగ్స్ పార్టీ కలకలం

## ఆరుగురికి పాజిటివ్




వీకెండ్‌లో హైదరాబాద్‌లో మరోసారి డ్రగ్స్ పార్టీ కలకలం రేపింది. గోల్కొండలోని తారామతి బారాదరి రిసార్టులో శనివారం అర్ధరాత్రి తెలంగాణ ఈగల్ టీం నిర్వహించిన తనిఖీల్లో ఆరుగురికి డ్రగ్స్ పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. శనివారం రోజు తారామతి బారామతి రిసార్టులో 'మోర్ దెన్ ఫ్రెండ్స్' పేరుతో ఓ ప్రైవేట్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని చంద్ర అనే వ్యక్తి నిర్వహించినట్లు తెలిసింది. అయితే పర్యాటక ప్రచారంలో భాగంగా ఈవెంట్ నిర్వహిస్తున్నట్లు వేడుకకు చివరి నిమిషంలో పోలీసులు అనుమతి పొందడానికి ప్రయత్నించారు. కాని వారి నుంచి అనుమతి రాలేదు. అయినప్పటికి కూడా ఈవెంట్ ప్రారంభించారు.

**డ్రగ్ పరీక్షలో ఆరుగురికి పాజిటివ్**

ఈ పార్టీకి కేవలం మద్యం సేవించడానికి మాత్రమే ఎక్సైజ్ శాఖ నుంచి అనుమతి తీసుకున్నారు. ఈ ఈవెంట్?కి దాదాపు 200 మందికి పైగా హాజరయ్యారు. ఈ వేడుకలో కొందరు వ్యక్తులు డ్రగ్స్ సేవిస్తున్నారని తెలంగాణ ఈగల్ టీమ్‌కు సమాచారం అందింది. డ్రగ్స్ వినియోగదారుల సస్పెక్ట్ షీట్?లో ఉన్న వ్యక్తులు ఈ పార్టీకి హాజరయ్యారనే సమాచారంతో ఈగల్ టీమ్ డీఎస్పీ భిక్షపతి, స్థానిక గోల్కొండ పోలీసుల సహాయంతో రాత్రి 10 గంటల సమయంలో ఆకస్మిక దాడి నిర్వహించారు.

ఎవరూ తప్పించుకునేందుకు అవకాశం లేకుండా చేసి అనుమానాస్పదంగా సుమారు 36 మందిని డ్రగ్ పరీక్షలు నిర్వహించారు. వీరిలో ఆరుగురికి పాజిటివ్ అని తేలింది. డ్రగ్స్ సేవించినట్లు నిర్ధారణైన వారిలో ఒక యువతి కూడా ఉన్నట్లు సమాచారం. పోలీసులు వీలందరిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పాజిటివ్? వచ్చిన వారి వివరాలు ఇలా ఉన్నాయి. పరం సి నిహార్?, ఆశి, అబ్దుల్? సర్వర్?, యోగేశ్వర్?, జాసన్? అనే వ్యక్తులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. నిందితులను ప్రశ్నించిన తరువాత వారిని ఇవాళ న్యాయమూర్తి ముందు ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఈ కేసుకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని త్వరలో వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

## డ్రగ్స్ నెట్‌వర్క్‌లో రోహిత్‌రెడ్డి సోదరుడే కీలకం

# సిట్ దర్యాప్తులో ఎన్నో కొత్త విషయాలు

మొయినాబాద్ డ్రగ్స్ పార్టీ, కాల్పుల కేసులో రోజుకో కొత్త విషయం వెలుగులోకి వస్తున్నాయి. రోహిత్ రెడ్డి అక్రమ లావాదేవీలకు ఆయన సొంత సోదరుడు రితేష్ రెడ్డి బినామీగా వ్యవహరిస్తున్నట్లు సిట్ బృందం దర్యాప్తులో తేలింది. ఆరోజు డ్రగ్స్ పార్టీ వ్యవహారంలో రితేష్ రెడ్డి పాత్ర కేవలం అతిథిగా మాత్రమే లేదని మాజీ ఎమ్మెల్యేకు సంబంధించిన అనేక ఆర్థిక వ్యవహారాలను, ఆస్తులను రితేష్ తన పేరు మీద నిర్వహిస్తున్నట్లు ఆధారాలు లభించాయి. డ్రగ్స్ నెట్‌వర్క్‌తో సంబంధం ఉన్న వ్యక్తులతో జరిపిన లావాదేవీల వెనుక రితేష్ రెడ్డి కీలకంగా వ్యవహరించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

**మరో కస్టడీ పిటిషన్**

రితేశ్ రెడ్డి బినామీ వ్యవహారంపై దర్యాప్తు జరిపిన అధికారులు కొన్ని ప్రాథమిక ఆధారాలను సైతం అధికారులు సేకరించారు. రోహిత్‌రెడ్డి తరఫున రితేశ్ కొన్ని లావాదేవీలు నిర్వహిస్తున్నట్లు దర్యాప్తులో బయటపడ్డాయి. వీరిద్దరి బ్యాంకు ఖాతాలు, ఇతర వివరాలు పరిశీలించినప్పుడు అనుమానాస్పద నగదు, ఆన్‌లైన్ లావాదేవీలు గుర్తించారు. పోలీస్ కస్టడీలో వీటి గురించి ప్రశ్నించినప్పుడు నిందితులు సంతృప్తికరంగా సమాధానాలు ఇవ్వలేదని వీటి వెనుక నిజాలు నిగ్గుతేల్చేందుకు మరో 3 రోజులు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పోలీసులు ఉప్పర్‌పల్లిలోని న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు.

**పొంతనలేని సమాధానాలతో సరి**



రోహిత్‌రెడ్డి, ఆయన సోదరుడు రితేశ్‌రెడ్డి.. దిల్లీ వ్యాపారి నమిత్ శర్మను పోలీసులు ఈ నెల 15న అరెస్టు చేసి రెండు విడతల్లో 6 రోజుల పాటు కస్టడీకి తీసుకుని విచారణ జరిపారు. మరో మూడు రోజులు కస్టడీకి ఇవ్వాలంటూ శనివారం పిటిషన్ దాఖలు చేశారు. సోమవారం వాదనలు వింటామని న్యాయమూర్తి వాయిదా వేశారు. ఈ సందర్భంగా నిందితులు విచారణకు సహకరించడం లేదంటూ పోలీసులు పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ నెల 1 నుంచి మూడు రోజులు కస్టడీకి తీసుకుని విచారించినా ముగ్గురు నిందితులు ఏమాత్రం సహకరించడం లేదని కస్టడీ పిటిషన్‌లో పేర్కొన్నారు. డ్రగ్స్ ఎలా వచ్చాయి? ఎవరు అందించారు? లావాదేవీలు ఎలా జరిగాయి? ఇతరుల ప్రమేయం గురించి ప్రశ్నిస్తే సమాధానాలివ్వకుండా తప్పించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని పిటిషన్‌లో వెల్లడించారు. కొన్ని ప్రశ్నలకు పొడిపొడి సమాధానాలిస్తున్నారు. డ్రగ్స్ పార్టీల కోసం ఎక్కడికి వెళ్లారు? హోటల్ బుకింగ్‌ల గురించి లోతుగా ఆరా తీసినా పూర్తి వివరాలు ఇవ్వడం లేదని కస్టడీ పిటిషన్‌లో తెలిపారు. డ్రగ్స్ సరఫరాకు మూలాలెక్కడ? డ్రగ్స్ పార్టీలు జరిగినప్పుడు వీరితో పాటు పాల్గొన్న వినియోగదారుల గురించి సమాధానాలివ్వడం లేదని తెలిసింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా ఎంతో మంది అనుమానితుల పేర్లు వెలుగులోకి వస్తున్నా వీరి గురించి పూర్తి సమాచారం రావాలని పోలీసులు భావిస్తున్నారు. ఇప్పటివరకు సేకరించిన సమాచారంతో పాటు మత్తు పదార్థాలు, డిజిటల్ ఆధారాలు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన రికార్డులు మరిన్ని సేకరించాల్సి ఉందని పోలీసులు అభిప్రాయపడ్డారు. వాస్తవాలు సేకరించాలన్నా, పరారీలో ఉన్న మరికొందరు నిందితుల్ని గుర్తించి అరెస్టు చేయాలన్నా వీరిని కస్టడీకి తీసుకోవడం తప్పనిసరి. వారిచ్చిన వాంగ్మూలాలను పరిశీలించి డ్రగ్స్ సరఫరా గొలుసును ఛేదించాలి. నిందితుల డ్రగ్స్ పార్టీల వెనుక భారీ నెట్‌వర్క్‌తో పాటు ఎంతో మంది పెద్దలు, నిర్వాహకులు ఉన్నారు. గతంలో డ్రగ్స్ పార్టీలు చేసుకున్న ప్రాంతాలకు వెళ్లి, కొన్ని ఆధారాలు సేకరించాల్సి ఉంది. రోహిత్‌రెడ్డి, రితేశ్‌రెడ్డి మధ్య ఆన్‌లైన్ లావాదేవీల వెనుక ఇతరుల పాత్ర గురించి ప్రశ్నించాల్సి ఉంది. దిల్లీకి చెందిన వ్యాపారి నమిత్‌శర్మ అతడి చిరునామా, నేపథ్యం, నేర చరిత్ర గురించి సమర్పించిన ఆధారాలను తనిఖీ చేయాల్సి ఉందని కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోరారు.

## ఈ ప్రాజెక్టు ఓ గొప్ప అవకాశం

-మొదటిపేజీ తరువాయి

అనంతరం భవన నిర్మాణానికి సంబంధించిన నమూనాలను పరిశీలించారు. నిర్మాణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వేద పండితుల సమక్షంలో జరిపిన శంకుస్థాపన పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సీజేఐ మాట్లాడారు. దాదాపు 23 ఏళ్ల సుదీర్ఘ కాలంగా న్యాయ వ్యవస్థలో పనిచేస్తున్నానని పేర్కొన్నారు. ఇప్పటికే హైకోర్టు జోన్-1 భవన కాంప్లెక్స్ నిర్మాణంలో ఉందని, ప్రస్తుతం హైకోర్టు జోన్-2 భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసుకున్నామని గుర్తు చేశారు. కోర్టులో జరుగుతున్న ప్రొసీడింగ్స్ అనేవి ప్రజలకు విజిబుల్ జ్యుడీషియరీ అని, కోర్టు గది వెనక మరో ప్రపంచం ఉంటుందని తెలిపారు. కోర్టు కార్యకలాపాలు కొనసాగుతూనే ఉంటాయని, జడ్జిల నివాస సముదాయాల్లో కార్యకలాపాలు నడుస్తూనే ఉంటాయని అన్నారు. ఈ సందర్భంగా హైకోర్టు నిర్మాణ పనులు చేపడుతున్న ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. డైనమిక్ సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో పాలన కొనసాగుతోందని కితాబిచ్చారు.

జ్యుడీషియరీ వ్యవస్థ నిర్మాణంలో సానుకూల దృక్పథంతో సాగుతున్నారు. ప్రతి రాష్ట్రానికి హైకోర్టు ఏర్పాటు అనేది రాజ్యాంగ బాధ్యత. కోర్టు ఏర్పాటు న్యాయ అవసరమే కాదు, నిబద్ధతతో ఏర్పాటు చేయాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జోన్ -1 నిర్మాణం బాగా జరుగుతోంది. జ్యుడీషియరీ, రాష్ట్ర ప్రభుత్వం సమాంతరంగా ముందుకు వెళ్లాల్సి ఉంది. వందేళ్ల అవసరాలకు తగిన విధంగా మౌలిక సౌకర్యాల కల్పన తప్పనిసరి.

**ఈ ప్రాజెక్టు ఓ గొప్ప అవకాశం**

హైకోర్టు భవన నిర్మాణ పనుల శంకుస్థాపనలో పాల్గొనడం సంతోషంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాజకీయ నాయకుల జీవితాల్లో ఇలాంటి సందర్భం అరుదుగా వస్తుందన్నారు. ప్రార్థనా మందిరాల నిర్మాణంలో పాల్గొనడం అరుదుగా వస్తుందని, హైకోర్టు కాంప్లెక్స్ అనేది అన్ని వర్గాల ప్రజలకు ఆలయం వంటిదని వ్యాఖ్యానించారు. లెజిస్లేచర్, ఎగ్జిక్యూటివ్, జ్యుడీషియరీ వ్యవస్థలు స్వతంత్రంగా పనిచేస్తాయన్న సీఎం, సామాన్య ప్రజలు న్యాయం కోసం చివరగా కోర్టు తలుపు తడతారన్నారు. హైకోర్టు కాంప్లెక్స్ ప్రాజెక్టు చేపట్టడం తనకు, తమ ప్రభుత్వానికి గొప్ప అవకాశంగా భావిస్తున్నానని స్పష్టం చేశారు.

## క్రీడల్లో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలుపుతాం

-మొదటిపేజీ తరువాయి

జరీన్‌కు రూ.2 కోట్లు ఇచ్చి ప్రోత్సహించాం. క్రికెటర్ సిరాజ్‌కు రూ.కోటి, ఇంటి స్థలం ఇచ్చి సత్కరించాం.. డీఎస్పీ ఉద్యోగం ఇచ్చాం. క్రీడల్లో రాణించాల్సిన యువత మత్తుబారిన పడటం బాధాకరం. పంజాబ్ వంటి రాష్ట్రాల్లో యువత డ్రగ్స్ బారినపడి జీవితాలు నాశనం చేసుకున్నారు. ఇటీవల కాలంలో హైదరాబాద్‌లో కూడా డ్రగ్స్ కల్చర్ పెరిగింది. హైదరాబాద్ పోలీసులు సైబర్ నేరాలు, డ్రగ్స్ కట్టడిలో ముందున్నారు" అని రేవంత్‌రెడ్డి అన్నారు

## లచ్చమ్మ కుంట చెరువు.. హైడ్రాకు హరీష్ సవాల్

-మొదటిపేజీ తరువాయి

కాంగ్రెస్ భక్షించే ప్రయత్నం జరుగుతోంది. నాదర్‌గూల్ భూముల కుంభకోణం జరిగింది. పేదల భూముల్లోకి వారిని పోకుండా అడ్డుకుంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. నాదర్‌గూల్ భూముల కోసం చాలా ఏళ్లుగా పోరాటం జరుగుతుంది. ఈ భూమి తనదేనని రాజ్ బహదూర్ కోర్టులో పోరాటం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ భూములను నిషేధిత జాబితాలో చేర్చడం జరిగింది. ప్రస్తుతం ఈ భూముల వ్యవహారం సుప్రీంకోర్టులో ఉంది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం భూ భారతి పోర్టల్‌లో ఈ ల్యాండ్ ప్రభుత్వ భూమిగా పేర్కొంది. ఈ భూములను కాపాడాల్సిన బాధ్యత ఆర్డీవోది. దీనిపై అక్కడి రైతులు రెవెన్యూ అధికారులకి, హైడ్రా కమిషనర్‌కి ఫిర్యాదు చేసినా ఎందుకు స్పందించడం లేదు. నాటి ఇందిరమ్మ ప్రభుత్వంలో పేదలకు ఇచ్చిన భూమిని రేవంత్ రెడ్డి లాకుంటున్నారు. స్వయంగా రెవెన్యూ మంత్రే ఈ భూముల ఆక్రమణ వెనుక ఉంటే అధికారులు ఎలా చర్యలు తీసుకుంటారు. రేవంత్ రెడ్డి అసెంబ్లీలో భూములను ఆక్రమిస్తే ఎవర్ని వదలను అన్న సీఎం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు. ఈ భూములపై హైడ్రా ఎందుకు యాక్షన్ తీసుకోవడం లేదు. లచ్చమ్మ కుంట చెరువును అక్కడ పెద్దలు ఆక్రమిస్తుంటే హైడ్రా కమిషనర్ ఏం చేస్తున్నారు?. చెరువులను కాపాడుతా అనే హైడ్రాకు కళ్లు కనబడటం లేదా?. హైడ్రా కమిషనర్‌కి సవాల్ చేస్తున్నా. రేపు హైడ్రా కమిషనర్ రావాలి లేదా మా ఎమ్మెల్యేలతో నేనే వెళ్తాను. మరోవైపు 80 ఎకరాల గుట్టలు మాయం చేస్తూ కోట్లు కొల్లగొడుతున్నారు. ఈ నెల 7న ఈ భూములపై సుప్రీంకోర్టులో విచారణ ఉంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వారంలోనే ఈ భూమి కోహినూర్‌కి చెందింది అని బోర్డు పెట్టారు. శిల్పా ఇన్‌ఫ్రా పొంగులేటి కుమారుడిది. ఈ భూముల వెనుక పొంగులేటి కుటుంబ సభ్యులే ఉన్నారు అంటూ' వ్యాఖ్యలు చేశారు.

## మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణ 2 ఏళ్లుగా లేఖలతోనే సరి

-మొదటిపేజీ తరువాయి

మాత్రం ఈ దిశగా చర్యలు తీసుకోలేదని సంబంధిత వర్గాలు తెలిపాయి. 2024 జనవరి నుంచి ఇప్పటివరకు నిర్మాణ సంస్థ, నీటిపారుదల శాఖ ప్రాజెక్టు ఇంజినీర్లు రాసిన లేఖలన్నింటినీ జత చేసి చర్యలు తీసుకోవాలని, ఏం చర్యలు తీసుకొన్నది తమకు తెలపాలని, ఫిబ్రవరిలో ఈఎన్సీ కాళేశ్వరం చీఫ్ ఇంజినీర్‌కు లేఖ రాసినా ఇప్పటి వరకు స్పందన లేదని తెలిసింది. 2023 అక్టోబరులో మేడిగడ్డ బ్యారేజీ కుంగడంతో పాటు ఏడో బ్లాక్ పియర్స్ బీటలు వారాయి. దీనిపై విచారణ చేసిన విజిలెన్స్ నిర్మాణ సంస్థ ఎల్? అండ్? టీ - పీఈఎస్? సంస్థపై చర్యకు సిఫార్సు చేయడంతో పాటు పునరుద్ధరణ బాధ్యత నిర్మాణ సంస్థదేనని పేర్కొంది. 3 బ్యారేజీలపై విచారణ జరిపిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ పునరుద్ధరణ బాధ్యత నిర్మాణ సంస్థదేనని, నిర్మాణ సంస్థ ముందుకు రాకపోతే ప్రభుత్వమే పూర్తి చేసి తర్వాత రికవరీ చేయాలని సిఫార్సు చేసింది. రెండు నివేదికలూ వచ్చి నెలలు గడుస్తున్నా, ఈ దిశగా చర్యలు మాత్రం లేవు. మరోవైపు నిర్మాణ సంస్థ ఇప్పటివరకు నీటిపారుదల శాఖకు 21 లేఖలు రాసింది. పునరుద్ధరణ బాధ్యత తమది కాదని డిజైన్ లోపం వల్లే బ్యారేజీకి నష్టం వాటిల్లిందని, అనుబంధ ఒప్పందం చేసుకొంటేనే పనులు చేస్తామని స్పష్టం చేసింది. ఈ సంస్థకు పని పూర్తయినట్లు ఇచ్చిన సర్టిఫికెట్‌ను ప్రభుత్వం రద్దు చేసింది. బ్యారేజీ ప్రారంభించిన తర్వాత మొదటి సంవత్సరంలోనే లోపాలు గుర్తించి కింది స్థాయి ఇంజినీర్లు లేఖలు రాసినా మరమ్మతులు చేయలేదు.

**లేఖలు రాసినా పట్టించుకోని నీటిపారుదల శాఖ**

డిఫెక్ట్ లయబిలిటీ పీరియడ్‌లో ఉన్నప్పుడే సమస్యలను గుర్తించి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు లేఖలు రాశారు. అప్పుడే స్పందించి ఉంటే బ్యారేజీకి తీవ్ర నష్టం వాటిల్లేది కాదన్న అభిప్రాయం కూడా ఇంజినీరింగ్ వర్గాల్లో వ్యక్తమైంది. కింది స్థాయి ఇంజినీర్లు లోపాలు గుర్తించి మరమ్మతులు చేయాలని లేఖలు రాస్తున్నా, పై స్థాయి ఇంజినీర్లు ఇవేమీ పట్టించుకోకుండా పని పూర్తయినట్లు ధ్రువీకరణ పత్రం ఇచ్చేశారు. బ్యాంకు గ్యారంటీలు తిరిగి ఇచ్చేశారు. విజిలెన్స్, జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఈ లోపాలన్నింటినీ ఎత్తిచూపి బాధ్యులపై చర్యలకు సిఫార్సు చేసినా నీటిపారుదల శాఖ పట్టించుకోలేదు.

**లేఖలు రాయడంతోనే గడిచిపోయిన రెండేళ్లు** : మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్ద నీటిపారుదల శాఖ మంత్రి వద్ద జరిగిన సమీక్షా సమావేశాల్లో పునరుద్ధరణ బాధ్యత నిర్మాణ సంస్థదేనని, ఈ మేరకు పని పూర్తి చేయించడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ సంస్థకు కూడా ఈ విషయాన్ని స్పష్టం చేసినట్లు నీటిపారుదల శాఖ వర్గాలు తెలిపాయి. ఒప్పందంలోని నిబంధనలను పొందుపరిచి నీటిపారుదల శాఖ ప్రాజెక్టు ఇంజినీర్లకు, ప్రాజెక్టు ఇంజినీర్లు నిర్మాణ సంస్థకు, నిర్మాణ సంస్థ తిరిగి ప్రాజెక్టు ఇంజినీర్లకు లేఖలు రాయడంతోనే రెండేళ్లు గడిచిపోయాయి. చివరి నోటీసు జారీ చేసి చర్యలకు ఉపక్రమించాలని 3 నెలల కిందట ఇంజినీర్ ఇన్ చీఫ్ కార్యాలయం లేఖ రాసినా ప్రాజెక్టు ఇంజినీర్ల నుంచి సమాధానం రాలేదు. నెల క్రితం మొత్తం 34 ఉత్తర ప్రత్యుత్తరాల వివరాలతో లేఖ రాసి చర్యలు తీసుకోవాలని ఏం తీసుకొన్నది తమకు తెలపాలని కోరినా ఎలాంటి సమాధానం లేదని నీటిపారుదల శాఖ వర్గాలు పేర్కొన్నాయి. దీనిపై మంత్రి మళ్లీ సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు తెలిసింది.

# స్టడీ సర్కిల్ వెలవెల!

**నిరుద్యోగులు విలవిల**
**నోటిఫికేషన్లు లేక పేటలోని స్టడీ సర్కిల్ నిర్వీర్యం**
**బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వేల మందికి శిక్షణ, ఉద్యోగాలు**
**ఉసూరుమంటున్న నిరుద్యోగులు**



**సూర్యాపేట :** బీఆర్ఎస్ హయాంలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలనే కలలను సాకారం చేసిన స్టడీ సర్కిళ్లు.. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో నిర్వీర్యమైపోయాయి. ఎన్నికల సమయంలో ఏటా రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, నేడు నిరుద్యోగుల ఆశలను ఆవిరి చేసింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉద్యోగ నోటిఫికేషన్లు, అదే స్థాయిలో స్టడీ సర్కిళ్లలో ఉచితంగా కోచింగ్ ఇచ్చి, వందలాది నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చిన స్టడీ సర్కిళ్లు నేడు వెలవెల పోతున్నాయి.తెలంగాణ పర్యాటకం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాల ఫలితాలు ప్రతి కుటుంబానికి దక్కేవి. ఏదో ఒక వర్గమో... జాతికో కాకుండా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందేవి. దీంతో తరతరాలుగా అట్టడుగున ఉండి, సాయం కోసం ప్రభుత్వం వైపు దీనంగా చూస్తున్న వర్గాల కోసం చేపట్టిన పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచిన విషయం విదితమే. అందులో నిరుద్యోగుల కోసం స్టడీ సర్కిళ్లు ఏర్పాటు ఒకటి. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి జిల్లా కేంద్రంలో ఎస్సీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయించారు. నాడు కొలువుల భర్తీకి ప్రకటనలివ్వడమే కాదు,.. పరీక్షలకు తయారయ్యేందుకు సర్కారే సాయం అందించేలా స్టడీ సర్కిల్‌ను ఏర్పాటు చేసి వివిధ బ్యాచ్‌ల ద్వారా 550 మంది వరకు లబ్ధి చేకూర్చారు. తొలుత స్టడీ సర్కిల్‌లో ప్రతి అభ్యర్థికి నెలకు రూ.1500 చెల్లించగా కేసీఆర్ ఒకే సారి మెస్ చార్జీలను రూ.2250కు పెంచారు. దీంతో పాటు పోటీ ప్రపంచాన్ని తట్టుకునే విధంగా ప్రతి ఒక్కరికి రూ.2500 విలువైన స్టడీ మెటీరియల్‌ను అందజేసేవారు. స్టడీ సర్కిల్‌లో ప్రతి బ్యాచ్‌కు 100 మంది విద్యార్థులకు అవకాశం ఉండగా, అర్హత సాధించిన ప్రతి అభ్యర్థిపై ఎటువంటి ఆర్థిక భారం పడకుండా నోటు పుస్తకాలను ఉచితంగా ప్రభుత్వమే అందించింది. శిక్షణ పొందుతున్న వారికి ప్రభుత్వం అన్ని రకాల వసతులు కల్పించడంతో పాటు ప్రతి నెలా బాలికలకు రూ.150, బాలురకు రూ.100 అందజేశారు. తద్వారా శిక్షణ పొందిన నిరుద్యోగులు ఉద్యోగాలు సాధించడంతో వారి కలలు సాకారం కావడమే కాకుండా ప్రభుత్వ లక్ష్యం నెరవేరింది.

**రెండేళ్లుగా తెరుచుకోని స్టడీ సర్కిల్..**

సూర్యాపేటలోని ఎస్సీ స్టడీ సర్కిల్ రెండేళ్లుగా తెరుచుకోవడం లేదు. ఏదైనా ఉద్యోగాల కోసం ప్రభుత్వ నోటిఫికేషన్ విడుదలైన తరువాత స్టడీ సర్కిల్‌లో అభ్యర్థులను తీసుకోవడానికి నోటిఫికేషన్లు విడుదల చేస్తారు. ఇలా గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చివరి సారిగా 2023 ఆగస్టులో నోటిఫికేషన్ విడుదల కాగా నాటి నుంచి బీఆర్ఎస్ ప్రభుత్వం దిగిపోయే వరకు పది బ్యాచ్‌లు పూర్తయ్యాయి. దీంతో సుమారు 550 మందికి ఎస్ఐ, గ్రూప్-2, గ్రూప్-4, కానిస్టేబుల్, బ్యాంకు, రైల్వే తదితర ప్రభుత్వ ఉద్యోగాలు లభించాయి. ఇక రెండేళ్ల కాంగ్రెస్ హయాంలో ప్రభుత్వ ఉద్యోగాల ఊసే లేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నియామకాలు పూర్తయిన అభ్యర్థులకు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నియామక పత్రాలు ఇవ్వగా, ఒకటీ రెండు నోటిఫికేషన్లు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. రెండు నెలల క్రితం స్టడీ సర్కిల్‌లో అభ్యర్థుల కోసం నోటిఫికేషన్ ఇచ్చినప్పటికీ ఫలితాలు మాత్రం విడుదల కాకపోవడంతో అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**తక్షణమే శిక్షణ ప్రారంభించాలి**

గత బీఆర్ఎస్ ప్రభుత్వం వెనుకబడిన తరగతులైన ఎస్సీ, ఉపకులాలకు ప్రతి సంవత్సరం ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు ఇప్పించేందుకు కృషి చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి నోటిఫికేషన్ రాలేదు. స్టడీ సర్కిల్ ప్రారంభించలేదు. దీంతో నిరుద్యోగులకు నష్టం వాటిల్లుతున్నది. తక్షణమే స్టడీ సర్కిల్ ప్రారంభించి పేద విద్యార్థులకు శిక్షణ అందించాలి.

# పదవుల కోసం విలవిల!



**నిజామాబాద్ :** అధికార కాంగ్రెస్ పార్టీలో అసంతృప్త రాగాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. పదవుల కోసం ఎదురు చూస్తున్న నేతలకు భంగపాటు తప్పకపోవడంతో ముఖ్య నేతలపై నిట్టూరుస్తున్నారు. బహిరంగంగానే కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానంపై నిప్పులు చెరుగుతున్నారు. వర్గాలుగా విడిపోయిన నేతలంతా ఎవరికి వారు పదవుల కోసం చాలా రోజుల నుంచి పైరవీలు చేసుకుంటున్నారు. పదవుల కోసం అర్రులు చాచిన నేతలకు పార్టీ పదవులు దక్కాయి. పార్టీ పదవులు చేపట్టిన నేతల్లోనూ అంసతృప్తి రగులుతోంది.తెలంగాణ పర్యాటకం ప్రభుత్వంలోనే కీలకమైన పోస్టులు అప్పగించాలంటూ డిమాండ్ చేస్తున్నారు. దీంతో అధిష్ఠానం వీరి మొర వినకపోవడంతో కొంత మంది నేతలు బహిరంగంగానే తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమయ్యారు. కొందరైతే ఒకడుగు ముందుకేసి ఫ్లెక్సీ రాజకీయాలకు తెర లేపారు. ఓ నేత పేరిట నగరంలో ఫ్లెక్సీలు ఏర్పాటు కావడం తో హస్తం పార్టీలో దుమారం రేపుతోంది. పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సొంత జిల్లాలో పదవుల కోసం జరుగుతోన్న తంతుపై సర్వత్రా విస్మయం ఏర్పడింది. ప్రభుత్వంలో పదవులు చేపట్టేందుకు ఉమ్మడి జిల్లా నేతలకు సమర్థత లేదా? అని నిలదీస్తున్నారు. అర్హతలు ఉన్నప్పటికీ పదవులు కట్టబెట్టకపోవడానికి కారణాలు ఏమిటి? అని ప్రశ్నిస్తున్నారు.

**ఫ్లెక్సీలకు పదవులు రాలేనా...?**

ఎమ్మెల్యేలకు తోడుగా సీనియర్ లీడర్లు పార్టీ తీరుపై భగ్గుమంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇంకా రెండున్నరేళ్ల కాలమే మిగిలి ఉంది. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం పగటి కలగానే మారనుంది. మిగిలిన కాలాన్ని సద్వినియోగం చేసుకోవడం ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ పదవులు వరించడం లేదు. రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ పోస్టులు ఆశించిన వారికి తీపి కబురు రాకపోవ డంతో అసంతృప్తితో కొట్టుమిట్టాడుతున్నారు. పదవుల పంపకాలపై నేడు, రేపు అంటూ కాలం గడుపుతుండడంతో జీర్ణించుకోలేక పోతున్నారు. ముఖ్య నేతలను ప్రసన్నం చేసుకోవడానికి వారి పేరిట ప్రకటనలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. జేబులు ఖాళీ అవుతున్నప్పటికీ ఆశించిన గౌరవం దక్కకపోవడంతో నేతలంతా గుర్రుమంటున్నారు. కాంగ్రెస్ పార్టీలో అనేకులు తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు నుంచి పార్టీలు మారకుండానే నిబద్ధతతో కొనసాగుతున్నారు. గతంలో పార్టీ మారేందుకు అవకాశాలు వచ్చినప్పటికీ కండువా మార్చలేదు. కానిప్పుడు గోడ దూకి వచ్చిన వారికే అగ్ర తాంబూలం దక్కుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్టీ మారిన లీడర్లకు మొన్న నగరపాలక, పురపాలక ఎన్నికల్లో కార్పొరేటర్, కౌన్సిలర్ సీట్లు దక్కించుకోవడంతో పాత నేతలకు మింగుడు పడడం లేదు. పార్టీలు మార్చినోడికే ప్రాధాన్యత ఇవ్వడం ఏమిటి? అని నిలదీస్తున్నారు. ఫలితంగా వర్గ విభేదాలు రోజురోజుకు తారా స్థాయికి చేరుకుంటున్నాయి. తాజాగా ఓ మాజీ ప్రజా ప్రతినిధి పేరిట వెలిసిన ఫ్లెక్సీలు చర్చనీయాంశం అవుతున్నాయి. పార్టీ కోసం పని చేస్తే పదవులు ఇవ్వరా? అంటూ నిలదీయడం కాంగ్రెస్ పార్టీలో గందరగోళానికి, అసంతృప్తికి అద్దం పడుతోంది.

**మంత్రి, విప్ పదవుల్లోనూ ధోకా..**

రేవంత్ రెడ్డి క్యాబినెట్‌లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చోటు కరువైంది. ప్రభుత్వం ఏర్పాటు నుంచి నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తీవ్రంగా ప్రయత్నాలు చేసినప్పటికీ సీనియర్, జూనియర్ ఎమ్మెల్యేలకు మంత్రి యోగం దక్కలేదు. పి.సుదర్శన్ రెడ్డికి క్యాబినెట్ ర్యాంక్‌తో ప్రభుత్వ సలహాదారుగా నియమించి చేతులు దులుపుకున్నారు. ఫలితంగా ఉమ్మడి జిల్లాకు మంత్రి పదవి లేకపోవడంతో ప్రభుత్వంలో చక్రం తిప్పే లీడరే కరువయ్యారు. తెలంగాణలో తొలిసారి ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వంలో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల నుంచి పి.సుదర్శన్ రెడ్డి, రేకులపల్లి భూపతి రెడ్డి, మదన్ మోహన్ రావు, లక్ష్మీకాంతారావులు ఎమ్మెల్యేలుగా గెలిచినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. బడ్జెట్ సమావేశాల సమయంలో శాసన మండలి, శాసన సభలో ప్రభుత్వ విప్‌లుగా పలువురిని ప్రభుత్వం నియమించింది. క్యాబినెట్ ర్యాంక్ కలిగిన ఈ పదవుల్లోనూ ఉమ్మడి జిల్లాకు మోసమే మిగిలింది. ఎమ్మెల్యేలకు విప్ పదవులు దక్కలేదు.తెలంగాణ పర్యాటకం ఆది నుంచి మంత్రి పదవి లేక, విప్‌లుగా నియామకం జరగక అడుగడుగునా కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు ధోకా జరుగుతోంది. కొత్త ప్రభుత్వాలు ఏర్పాటైన తర్వాత అసెంబ్లీ స్థాయి సంఘాల నియామకం చేపట్టడం ఆనవాయితీ. సభా సంఘాల కూర్పు లేకపోవడంతో కనీసం అందులోనూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు కనీసం చోటు లేకుండా పోయింది. బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డికి ప్రభుత్వ సలహాదారు పదవిని మినహాయిస్తే మంత్రి యోగం, విప్ పదవులు, నామినేటెడ్ హోదా కలిగిన పోస్టులు లేక మిగిలిన కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో తీవ్ర నైరాశ్యం నెలకొంది.

## అసలు సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఇలాంటి దాడులు : చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి



**హనుమకొండ :** గజ్వేల్‌లో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కేసీఆర్ క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ గూండాలు చేసిన దాడిని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా సీనియర్ నేత చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. మాజీ ముఖ్యమంత్రి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై వందాలాది మంది కాంగ్రెస్ పార్టీ నాయకులు దాడి చేయడం సిగ్గు చేటన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం అనేది ప్రభుత్వ ఆస్తి, అలాంటి కార్యాలయంపై దాడి చేయడం అంటే ప్రభుత్వ ఆస్తులనే ధ్వంసం చేసినట్లేనని పేర్కొన్నారు.తెలంగాణ పర్యాటకం ప్రజాస్వామ్యంలో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం అత్యంత దురదృష్టకరమన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రజల దృష్టిని అసలు సమస్యల నుంచి మళ్లించేందుకు ఇలాంటి దాడులను ప్రోత్సహిస్తున్నట్లుగా కనిపిస్తోందని ఆయన విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి స్థాయి నాయకుడి క్యాంపు కార్యాలయంపైనే ఇలాంటి దాడులు జరుగుతున్న పరిస్థితుల్లో సాధారణ ప్రజలకు భద్రత ఎక్కడ ఉందని ఆయన ప్రశ్నించారు. ఈ ఘటనపై పోలీసులు వెంటనే స్పందించి, దాడికి పాల్పడిన దుండగులను గుర్తించి కేసులు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ ఘటనలో పోలీసులు శాంతి భద్రతలు కాపాడాల్సింది పోయి వారే దగ్గర ఉండి దాడిని ప్రోత్సహించడం అత్యంత గర్హనీయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడేందుకు ప్రభుత్వం వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు.

## కాంగ్రెస్ అరాచక పాలన అంతు చూస్తాం జడ్పీ మాజీ చైర్‌పర్సన్



**జగిత్యాల :** రాష్ట్ర సాధకుడు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పై కాంగ్రెస్ గూండాలు అధికార మదంతో చేసిన దాడిని జగిత్యాల జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ తీవ్రంగా ఖండించారు.ఆదివారం మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడం చేతగాక ప్రజల దృష్టి మరల్చేందుకు కాంగ్రెస్ ఇలాంటి చర్యలను ప్రోత్సహిస్తోందని దుయ్యబట్టారు. తెలంగాణ పర్యాటకం రాబోయే రోజుల్లో కాంగ్రెస్ అరాచక పాలన అంతు చూస్తామని హెచ్చరించారు. ఇందిరమ్మ రాజ్యం అని చెప్పుకుంటూ, రేవంత్ రెడ్డి రాష్ట్రాన్ని పూర్తిగా రౌడీల రాజ్యంగా మార్చేశారని పేర్కొన్నారు. ప్రజల గుండెల్లో ఉన్న కేసీఆర్‌ను ఎవరూ చెదిపేయలేరని అన్నారు. పోలీసులు చట్టాన్ని కాపాడాల్సింది పోయి కాంగ్రెస్‌కు ప్రైవేట్ సైన్యంలా వ్యవహరించడం దుర్మార్గమని విమర్శించారు. దాడులకు పాల్పడుతున్న మూకలను పోలీసులు ఎందుకు అడ్డుకోవడం లేదని ఆమె ప్రశ్నించారు. చిల్లర దాడులకు బీఆర్ఎస్ భయపడదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీ 60 లక్షల సభ్యత్వం ఉన్న పార్టీ అని, కేసీఆర్ సైనికులుగా ప్రజల పక్షాన సమస్యల పట్ల పోరాడుతామని వెల్లడించారు. ఈ సమావేశంలో జగిత్యాల రూరల్, అర్బన్ మండల అధ్యక్షులు అయిల్నేని ఆనంద్ రావు, తుమ్మ గంగాధర్, పాక్స్ మాజీ చైర్మన్ మహిపాల్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కమలాకర్ రావు, ఎల్లా రాజన్న, హరీష్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వానికి కోపం ఉంటే నాపై చర్యలు తీసుకోండి.. హుజూరాబాద్ ప్రజలను శిక్షించకండి



హుజురాబాద్‌లో డంపింగ్ యార్డును రద్దు చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు. అయినా హుజూరాబాద్‌లో డంపింగ్ యార్డు ఎందుకు ఏర్పాటు చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఉమ్మడి వరంగల్, ఉమ్మడి కరీంనగర్ జిల్లాల నుంచి వచ్చే చెత్త మొత్తం మా హుజురాబాద్ కు తీసుకురావడం ఎందుకు? మా ప్రజలు ఏం తప్పు చేశారు? అని ప్రభుత్వాన్ని నిలదీశారు. నిన్న నేను హుజురాబాద్ బంద్‌కు పిలుపునిస్తే ప్రజలు స్వచ్ఛందంగా స్పందించి అద్భుతంగా విజయవంతం చేశారని తెలిపారు. ఒక్క దుకాణం కూడా తెరవకుండా ప్రజలు ఐక్యంగా నిలబడి డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా నిరసన తెలిపారని పేర్కొన్నారు. ఇది హుజురాబాద్ ప్రజల ఆవేదనకు నిదర్శనమని స్పష్టం చేశారు. ప్రభుత్వానికి నా మీద కోపం ఉంటే నాపై చర్యలు తీసుకోండి. కానీ హుజురాబాద్ ప్రజలను శిక్షించకండి అని కోరారు. ఇతర ప్రాంతాల చెత్తను మా హుజురాబాద్ పై మోపాలని ప్రయత్నించడం అన్యాయమని అన్నారు. నిన్నటి బంద్‌తో ప్రభుత్వం మేల్కొని వెంటనే డంపింగ్ యార్డ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఏప్రిల్ 7 ఉదయం 10 గంటల నుంచి 8వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దీక్ష చేపడతానని ప్రకటించారు. ప్రజల కోసం పోరాటం ఆగదని, అన్ని వర్గాల ప్రజలు మద్దతు ఇవ్వాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పిలుపునిచ్చారు

## కొలనూరులో వైకుంఠ రథానికి గ్రామస్తుల విరాళం



ఓదెల, ఏప్రిల్ 5 : పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం కొలనూరు గ్రామంలో విరాళాలతో కొనుగోలు చేసిన వైకుంఠ రథాన్ని గ్రామస్తులకు ఆదివారం అందజేశారు. గ్రామంలో ఎవరైనా చనిపోతే స్మశాన వాటిక స్థలం వరకు వెళ్లడానికి అంతిమయాత్రకు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో గ్రామంలోని కొందరు 'మానవసేవయే మాధవ సేవ' పేరా వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసి వైకుంఠ రథానికి విరాళాలను సేకరించారు. విరాళాల రూపంలో వచ్చిన డబ్బులతో వైకుంఠ రథాన్ని కొనుగోలు చేసి ఆదివారం గ్రామస్తులకు అందజేశారు. ఈ సమావేశంలో కరీంనగర్ కు చెందిన సామాజిక సేవకుడు, ప్రముఖ డాక్టర్ రఘురామన్ హాజరై విరాళాధాతలను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక సేవలోనే సరైన తృప్తి ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విరాళా దాతలతో పాటు నూతనంగా ఎన్నికైన గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులను శాలువాలతో సన్మానించారు. అలాగే ప్లాస్టిక్ నిషేధానికి బట్ట సంచులను డాక్టర్ రఘురామన్ అందజేసి, అవగాహన కల్పించారు. గ్రామంలో రూపాయి తీసుకోకుండానే వైకుంఠ రథం అందుబాటులో ఉంచుతామని గ్రామపంచాయతీ పాలకవర్గం తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం రాష్ట్ర నాయకుడు కన్నెబోయిన ఓదెలు యాదవ్, సర్పంచ్ పల్లె కనకయ్య, ఉపసర్పంచ్ పాకాల సంపత్ రెడ్డి, శివాలయం చైర్మన్ కలకొండ చిన్న రాజిరెడ్డి, పాకాల కరుణాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బైరి రవి గౌడ్, మాజీ సర్పంచ్ మాటూరి వెంకటస్వామి, పెద్దపల్లి ఏఎంసీ డైరెక్టర్ కొల్లూరి చందు, రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దెల నరసయ్య, పత్తి బుచ్చిరెడ్డి, జంగం కొమురయ్య, ఆర్యవైశ్య సంఘ నాయకులు ముస్త్యాల శ్రీనివాస్, యాంసాని కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## రామునిపల్లిలో వైభవంగా సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు

సుల్తానాబాద్ రూరల్ ఏప్రిల్ 5: పెద్దపెల్లి జిల్లా సుల్తానాబాద్ మండలంలోని రామునిపల్లి గ్రామంలోని ఆలయంలో సీతా రామచంద్ర స్వామి బ్రహ్మోత్సవాల ను వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలు భాగంగా నాగవెల్లి, పుష్ప యాగం, సప్తవర్ణాలు, తీర్థ ప్రసాదం వినియోగం. పండిత సన్మానం, తదితర కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో రామునిపల్లి సర్పంచ్ అనసూర్య, ఉప సర్పంచ్, పాలక వర్గం, కనుకుల సర్పంచ్ కర్రె కవిత, అర్చకులు. ఎస్ ప్రసాదచార్యులు, కాండూరి వాసు, అనిల్ కుమార చార్యులు, సంతోష్, శంకర్ శర్మ, భక్తులు పాల్గొన్నారు.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com